
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
శుక్రవారం 20 జూన్ 2025
జిల్లాల వార్తలు



అద్దె భవనం..
అరకొర సేవలు
అధ్వానంగా జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీ
అత్యవసర పరిస్థితుల్లో రామచంద్రాపురం ఆస్పత్రికి రెఫర్
కార్మికులకు తప్పని అవస్థలు
7

రెవెన్యూ సదస్సులు
90 శాతం పూర్తి
మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
ఎల్లంపల్లి గ్రామంలో పర్యటన
6

కేసు విచారణకు వచ్చిన
పోలీసులపై దాడి
6



రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు



పరస్పరం కేక్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో నిర్మలాజగ్గారెడ్డి

రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు

సంగారెడ్డి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని రోడ్లు భవనాలశాఖ అతిథిగృహం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి హాజరయ్యారు. భారీ కేక్‌ను కట్ చేసి పరస్పరం రాహుల్‌గాంధీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం కార్యకర్తలకు కేకులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని దేశ ప్రధానమంత్రిగా చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. దేశంలో శాంతియుత వాతావరణం నెలకొనాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అంచెలంచెలుగా అమలు చేస్తున్నారని నిర్మలాజగ్గారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు చెర్యాల ఆంజనేయులు, జార్జ్‌మాథ్యూస్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్, రుద్రారం ప్రకాష్, రామచందర్, నాగరాజు, ఉదయ్‌భాస్కర్, గంగేరి శ్రీహరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్‌కు
బాంబు బెదిరింపు
మాక్‌డ్రిల్ అన్న యాజమాన్యం, పోలీసులు



తరగతి గదిలో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

రామచంద్రాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ అంతర్జాతీయ పాఠశాలలో బాంబుపెట్టారని గురువారం ఉదయం వచ్చిన సమాచారం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఉదయం పాఠశాలకు చేరుకున్న బాంబు స్క్వాడ్ విద్యార్థులను బయటకు పంపి, తరగతి గదుల్లో తనిఖీలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, దేశంలో ఉగ్రదాడి, దాడులు, యుద్ధాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులను అప్రమత్తం చేయాలన్న సంకల్పంతో పాఠశాలలో మాక్ డ్రిల్ నిర్వహించినట్టు యాజమాన్యం, పోలీసులు పేర్కొన్నారు. ఈ ప్రకటనతో తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



మైదానంలోకి వచ్చిన విద్యార్థులు



వారం రోజులుగా వాన కరువై
పత్తి రైతుల కన్నీరు
వాడిపోతున్న ఆశలు.. రక్షించుకునేందుకు పాట్లు
మొలకలకు కూలీలతో నీరు పోయిస్తున్న రైతులు
వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూపులు
పత్తి సాగు విస్తీర్ణం పెరిగినా.. ప్రకృతి కరుణించక దిగులు

విత్తుకు విపత్తు

కంగ్టి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వాన చినుకు జాడ లేక.. ఈదురు గాలుల తీవ్రతకు పత్తి మొలకలు ఎండుముఖం పడుతున్నాయి. వాటి రక్షించుకునేందుకు రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఈసారి మృగశిర కార్తెకు ముందుగానే వర్షాలు సమృద్ధిగా కురియడంతో సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని కంగ్టి, దెగుల్‌వాడి, చౌకన్‌పల్లి, తడ్కల్, ముర్కుంజాల్, వల్మూర్, బోర్గి, భీంరా, నాగూర్ తదితర గ్రామాల్లో రైతులు కార్తె ఆరంభంలోనే పత్తి విత్తనాలు నాటు వేసుకున్నారు. తీరా విత్తనాలు మొలకెత్తినప్పటికీ వారం రోజులుగా చినుకు జాడ లేకుండా పోయింది. దీనికి తోడు బలమైన గాలులు వీస్తుండటంతో మొలకెత్తుతున్న పత్తి మొలకలు వాడిపోతున్నాయి. కళ్లముందే వాడుతున్న మొలకలను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి వసతి అంతగా లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి, కూలీల సహాయంతో మొక్కమొక్కకూ నీటిని పోస్తూ పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరో నాలుగైదు రోజులైనా వర్షం కురుస్తుందా అనే గంపెడాశతో అప్పటి వరకైనా మొలకెత్తిన మొలకలను రక్షించుకునేందుకు రైతులు ఇలా పడరాని పాట్లు పడుతున్నారు.

పెరిగిన పత్తి సాగు.. తగ్గిన సోయా విస్తీర్ణం

మండలంలో గత ఏడాది 26వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా.. ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం దాదాపు 30 వేల ఎకరాల వరకు పెరిగింది. గత ఏడాది మండలంలో సోయా సాగు 12 వేల ఎకరాల వరకు ఉండగా, ఈసారి సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. రైతులు ఈసారి పత్తి సాగు వైపు మొగ్గు చూపారు. కాగా, వాన దేవుడు కరుణించకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. తడ్కల్ ప్రాంతంలోని ముర్కుంజాల్, వల్మూర్, దామర్‌గిద్ద శివార్లలో రైతులు పత్తి మొక్కలను కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో విత్తనాలు నాటి వారం రోజులైనా చినుకు జాడ లేక ఇంకా మొలకలు రావడం లేదు. దీంతో రైతులు దేవుడి కరుణ కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.

మొలకలకు ట్యాంకర్‌తో నీరు



తొలకరి వర్షాలకు పత్తి విత్తనం వేసుకున్నాం. విత్తనాలు మొలకెత్తాక వాన జాడ లేకుండా పోయింది. మొలకలు వాడుతున్నాయి. మరో నాలుగైదు రోజుల వరకైనా రక్షించుకునేందుకు ట్యాంకర్లతో నీరు తెచ్చి కూలీలతో మొక్కమొక్కకు పోయిస్తున్నాం.

-ఆంజనేయులు, రైతు, తడ్కల్

బోరు నుంచి నీరు పెడుతున్నా



పది రోజుల క్రితం పత్తి విత్తనాలు వేయగా మొలకలు వస్తున్నాయి. వాన జాడ లేకపోవడంతో బోరు బావిలో ఉన్న కొద్దిపాటి నీటితో తుంపర్ల సహాయంతో మొలకలకు నీరు పెడుతున్నా.

-శివానంద్, రైతు, కంగ్టి

ఎల్‌ఆర్‌ఎస్.. డల్!

పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు.. దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు

వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కానీ డాక్యుమెంట్లు
ప్లాట్ల వివరాల్లో లోపాలు
కార్యాలయాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు
మూడు నెలలుగా కాలయాపన
సమస్యల పరిష్కారానికి సమన్వయం కరువు



మెదక్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగోసారి 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించే వెసులుబాటు కల్పించినప్పటికీ, సాంకేతిక సమస్యలు ప్లాట్ల యజమానులకు పెద్ద అడ్డంకిగా మారాయి. పోర్టల్‌లో డాక్యుమెంట్లు అప్‌లోడ్ కాకపోవడం.. ప్లాట్ వివరాల్లో లోపాలు తలెత్తడంతో దరఖాస్తుదారులు మూడు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు జాప్యం అవుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు

స్థలాల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుదారులకు ఎడతెగని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సాంకేతిక వ్యవస్థను రూపొందించింది. మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి మొదట్లో అవగాహన కల్పించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ సులభతరం చేయడానికి మొబైల్ యాప్‌లోనూ అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. టెక్నాలజీలో తరచూ మార్పులు చేర్పులు చేయడంతో ఇబ్బందులు వస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. మెదక్ పట్టణానికి చెందిన ఓ దరఖాస్తుదారుడు గత మూడు నెలలుగా ఈ పోర్టల్‌లో సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. దరఖాస్తుదారులు పత్రాలను సమర్పించడం, గడువులోపు ప్రక్రియను పూర్తి చేయడం సాధ్యపడటం లేదు. పత్రాలను అప్‌లోడ్ చేసేందుకు ప్రైవేటు ఇంటర్‌నెట్ సెంటర్లకు వెళ్లాలని మున్సిపల్ సిబ్బంది సూచిస్తున్నా, వారికి కూడా సరైన అవగాహన కొరవడటంతో సైట్‌లో పొందుపర్చలేకపోతున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బందిచే అప్‌లోడ్ చేయించడానికి ప్రయత్నించినా పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

స్పందించని నిర్వాహకులు

ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది గుడ్ గవర్నెన్స్ పోర్టల్ నిర్వాహకులకు మెస్సేజ్‌లు పంపుతున్నా, వారి నుండి అసలు స్పందన రావడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వానికి ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం సమకూరే అవకాశం ఉన్నప్పటికీ, పోర్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ద్వారా పథకం అమలులో అవరోధాలు తలెత్తుతున్నాయి. వెబ్‌సైట్ నెమ్మదిగా లోడ్ కావడం, అప్లికేషన్ సమర్పణలో లోపాలు రావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. అంతే కాకుండా, పలుమార్లు తప్పుగా వర్కవుట్ అవుతున్నట్లు ఆపరేటర్లు చెబుతున్నారు. మరి కొందరికి డబ్బులు కట్ అయినా, పేమెంట్ స్టేటస్ పెండింగ్‌లో ఉంటోందని వాపోతున్నారు. ఎక్కువగా సమస్యలు సైట్ ట్రాఫిక్ మూలంగా జరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఏదైమైనా ప్రత్యేక సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నించకపోతే ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని కోల్పోవలసి వస్తుంది.

మూడు నెలలుగా ప్రయత్నిస్తున్నా..



నాకు హౌజింగ్ బోర్డు టీచర్స్ కాలనీలో ప్లాట్ ఉంది. ప్రభుత్వం క్రమబద్ధీకరణకు 25 శాతం రాయితీ కల్పించడంతో మూడు నెలల క్రితం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు అడిగిన పత్రాలు అన్నీ ఇచ్చాను. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అనుమతులు కూడా తెచ్చాను. అయినప్పటికీ, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు అప్‌లోడింగ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్‌కు నాలుగు సార్లు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినా సాంకేతిక కారణాలతో సాధ్యపడలేదు. కనీసం ఈసారైనా అవకాశం లభిస్తుందో లేదో తెలియడం లేదు.

-అరునార్తి చంద్రశేఖర్, మెదక్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

భూ భారతిని రైతులు
సద్వినియోగం చేసుకోవాలి

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య
- నిజాంపేట మండలంలో పర్యటన
- రాంరెడ్డిపేటలో రెవెన్యూ సదస్సుకు హాజరు
- రేషన్ బియ్యం పంపిణీ పరిశీలన

నారాయణఖేడ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య పేర్కొన్నారు. నారాయణఖేడ్ డివిజన్‌లో గురువారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండల కేంద్రమైన నిజాంపేటలో ఎరువుల దుకాణాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల రికార్డులు, రైతులకు ఇచ్చిన బిల్లులు తనిఖీ చేశారు. పత్తి విత్తనాల ప్యాకెట్ల ట్యాగ్‌లు, స్టాక్ బోర్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను నిర్ణీత ధరలకే విక్రయించాలని సూచించారు. అంతకుముందు రాంరెడ్డిపేటలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి సన్న బియ్యం పంపిణీ తీరు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. రాంరెడ్డిపేటలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం రాంరెడ్డిపేటలో నిర్వహించిన రెవెన్యు సదస్సులో పాల్గొన్నారు. పలువురు దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడం కోసమే ప్రభుత్వం భూ భారతి కార్యక్రమాన్ని చేపట్టిందని వెల్లడించారు. రైతులు, భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాధాకిషన్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, వినోద్‌పాటిల్, రమేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌కు ఐటీఐ మంజూరు : ఎమ్మెల్యే

నారాయణఖేడ్‌కు ఐటీఐ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) మంజూరైందని, ఈమేరకు కార్మిక ఉపాధి శిక్షణ, పరిశ్రమలశాఖ జీవోవిడుదల చేసిందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ఐటీఐ నిర్మాణం కోసం ఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులో స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐటీఐ మంజూరు చేసిన ముఖ్యమంత్రికి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఆయన నారాయణఖేడ్ పట్టణం చుట్టూ నిర్మించనున్న రింగ్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, దారం శంకర్, పండరిరెడ్డి, రామకృష్ణ, శంకర్ ముదిరాజ్, తాహేర్‌అలీ, శ్రీకాంత్‌రెడ్డి, కిషన్‌నాయక్, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు ఓఆర్‌ఆర్ ఎఫెక్ట్

రింగ్ రోడ్డు లోపల ఉన్న భూములకు అందని సాయం
నాలుగు మండలాల్లో 27,120 మంది రైతుల ఎదురుచూపులు
కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు.. స్పందించిన మంత్రి తుమ్మల
రూ. 12.99 కోట్ల నిధులు విడుదల చేయాలని ఆదేశం

పటాన్‌చెరు/జిన్నారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గంలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా సాయం మంజూరవగా నియోజకవర్గంలో మాత్రం ఒక్క మండలం మినహా విడుదల కాలేదు. దీంతో, వేల మంది రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలవగా ఆయన ఆదేశాల మేరకు ఎట్టకేలకు రైతు భరోసా నిధుల విడుదలకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తొలుత ఒక్క మండలానికే..

పటాన్‌చెరు నియోజకవర్గంలో ఓఆర్‌ఆర్ లోపల ఉన్న జిన్నారం, పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచెంద్రాపురం మండలాల రైతులకు భరోసా ఆర్థిక సహాయం అందలేదు. ఓఆర్‌ఆర్ అవతల ఉన్న గుమ్మడిదల మండల రైతుల మాత్రమే నిధులు విడుదల చేశారు. మిగిలిన నాలుగు మండలాల పరిధిలో 43,302 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. 27,120 మంది రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. వీరికి రూ.12.99 కోట్ల మేర రైతు భరోసా సాయం అందాల్సి ఉంది. రైతు భరోసా నిధులు జమ కాకపోవడంతో వేలాది మంది రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు స్పందించి నియోజకవర్గ పెద్దలకు విషయాన్ని వివరించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేశారు. మంత్రి తుమ్మల తక్షణం స్పందించి సంగారెడ్డి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతీ రైతుకు రైతు భరోసా జమ చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం స్పందించిందని కాట శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నియోజకవర్గంలో రైతు భరోసా జమకాని 27,120 మంది రైతులకు మంత్రి ఆదేశాలతో త్వరలోనే సాయం అందుతుందని పేర్కొన్నారు. ఆయనవెంట మంత్రిని కలిసినవారిలో నియోజకవర్గ నాయకులు శ్రీహరి, సుధాకర్‌గౌడ్, శివానందం, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సంగారెడ్డిలో నిర్మాణంలో ఉన్న తూనికలు, కొలతల శాఖ కార్యాలయ భవనం

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్మిస్తున్న జిల్లా తూనికలు కొలతల శాఖ కార్యాలయ పక్కా భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పుష్కలంగా నిధులున్నా.. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే ఏడాది గడువు పొడిగించినా ఇప్పట్లో భవనం పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు.

నిధులున్నా నిర్లక్ష్యం

- తూనికలు, కొలతల శాఖ భవనం పూర్తయ్యేదెన్నడో?
- గడువు ముగిసినా పూర్తికాని పనులు
- నిధులు మంజూరై ఏడేళ్లయినా ఇదే తంతు
- ఈ ఏడాది జూలై వరకు గడువు పొడిగింపు
- అయినా కొలిక్కిరాని నిర్మాణం
- పాతికేళ్లుగా అద్దె భవనంలో జిల్లా కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో తూనికలు, కొలతల శాఖ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం 2018 సెప్టెంబరు 29 న రూ.50 లక్షలు మంజూరు చేసింది. సంగారెడ్డి బైపాస్‌రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్ పక్కన భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం 175 చ.గ.(1573 ఎస్ఎఫ్‌టీ) స్థలం కేటాయించింది. భవన నిర్మాణ బాధ్యతలను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. తొమ్మిది నెలల్లో భవన నిర్మాణ పూర్తి చేస్తామని అప్పట్లో ఒప్పందం చేసుకున్నారు. 2024 మార్చిలో నిర్మాణం మొదలుపెట్టిన కార్పొరేషన్ అదే ఏడాది నవంబరు నాటికి పనులు పూర్తి కావాల్సి ఉన్నా పురోగతి కనపించలేదు.

రెండుసార్లు పొడిగించినా..

గడువులోపు పనులు పూర్తికాకపోవడంతో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు అగ్రిమెంట్ గడువును పెంచారు. తొలుత 2025 మార్చి నాటికి గడువు పొడిగించారు. అయినా పనులు పూర్తయ్యే అవకాశం కనిపించకపోవడంతో మరోసారి జూలై వరకు గడువు పొడిగించారు. కానీ, ఈసారి కూడా గడువు లోపు భవన నిర్మాణ పనులు పూర్తిచేసి అప్పగించడంపై సందేహాలు నెలకొన్నాయి.

అద్దె భవనమే దిక్కు

సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లో జిల్లా తూనికలు కొలతల శాఖ కార్యాలయం(జిల్లా లీగల్ మెట్రాలజీ ఆఫీస్) సుమారు 25 ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఇందుకు నెల వారీ అద్దె రూ.5400 చెల్లిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఓ వైపు కేంద్రం నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ భవన నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తూనికలు కొలతల శాఖ జిల్లా కార్యాలయం ఇంకా అద్దె భవనంలోనే కార్యాలయం కొనసాగించే పరిస్థితి రావడం గమనార్హం. ఇప్పటికైన నూతన జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

రెవెన్యూ సదస్సులు 90 శాతం పూర్తి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
● ఎల్లంపల్లి గ్రామంలో పర్యటన


ఎల్లంపల్లిలో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్ జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు 90 పూర్తి చేసినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం టేక్మాల్ మండలంలో ఎల్లంపల్లి గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు హాజరై ఆయన మాట్లాడారు. ఈనెల 3 నుంచి 20 వరకు చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు సత్ఫలితాలనిస్తుందని అన్నారు. నిన్నటి వరకు 342 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తవగా, 28,118 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామ పర్యటనలో భాగంగా కలెక్టర్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించడంతోపాటు గ్రామంలోని ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలు ఎవరైనా ఉన్నారా అనే విషయాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు ఎల్లంపల్లి గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశంసించారు.

ఎండు గంజాయి, మద్యం పట్టివేత

మునిపల్లి, జూన్19 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు అక్రమంగా తీసుకెళ్తున్న ఎండు గంజాయి, మద్యాన్ని కంకోల్ టోల్ ప్లాజా వద్ద గురువారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ప్రొహిబిషన్, ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా ఓ స్కూటిని తనిఖీ చేయగా అందులో 450గ్రాముల ఎండు గంజాయి కనిపించింది. దీంతో సరుకును నిందితుల వద్ద ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. గోవా నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయగా వివిధ బ్రాండులకు సంబంధించి 5,450లీటర్ల సుంకం చెల్లించని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలోజిల్లా టాస్కుఫోర్స్, స్టేషన్ టీం సీల శంకర్, ఎస్సైలు హన్మంత్, సతీష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను చైతన్య పరచడానికే అవగాహన కల్పిస్తున్నామని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సైబర్ నేరాల అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రదేశాల్లో సైబర్ నేరాలపై అవగాహన వాల్ పోస్టర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి అకౌంట్ వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. ఆన్‌లైన్ మెసాలపై కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవేళ అనుకోకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడితే జాతీయ సైబర్ హెల్ప్ నెంబర్ 1930కి కాల్ చేయాలన్నారు. స్మార్ట్ ఫోన్ వాడే పిల్లల పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు

పాపన్నపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లిన వారి కారు రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో అక్కడికక్కడే ఇద్దరు చనిపోగా పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలో జరిగిన విషయం తెలిసిందే. గురువారం ఎల్లారెడ్డిలో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామమైన పాపన్నపేట మండల పరిధిలోని నర్సింగ్ రావు పల్లిలో బంధువుల అశ్రునయనాల మధ్య మృతుల అంత్యక్రియలు ముగిశాయి. వివరాల్లోకి వెళితే నర్సింగరావుపల్లి గిరిజన తండాకు చెందిన లునావత్ పీర్యా (37) ఉన్న ఊర్లో ఉపాధి కరువవడంతో సంగారెడ్డి వెళ్లి అక్కడ డోజర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య అతడి వెంట ఉండగా, పెద్ద కొడుకు సోను చీకోడ్ హాస్టల్ ఉంటూ 10 వ తరగతి, చిన్న కొడుకు ప్రవీణ్ 7వ తరగతి చదువుతున్నారు. అదే తండాకు చెందిన కెతావత్ పీర్యా(37)కు భార్య శారద, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. ఇతను కూతురు పెళ్లి చేయాలన్న ఆలోచనతో ఇటీవలే ఉన్న కొద్దిపాటి భూమి అమ్మేశాడు. లునావత్ పీర్యా తన మొక్కు చెల్లించుకోవడానికి బుధవారం తన యజమాని కారు తీసుకొని సంగారెడ్డి నుంచి నర్సింగరావు పల్లికి వచ్చాడు. ముందుగా అనుకున్నట్లుగా తన ఇద్దరు కొడుకులతో పాటు, తండాకు చెందిన కెతావత్ పీర్యా, వేణులతో కలసి రాత్రి పెద్ద గుట్టకు బయలు దేరారు. ఈ క్రమంలో మల్లయ్యపల్లి గేటు వద్ద కారు బోల్తా పడింది.ఈ ప్రమాదంలో లునావత్ పీర్యా, కెతావత్ పీర్యా దుర్మరణం చెందారు. సోను పక్కటెముకలు విరగగా, ప్రవీణ్ కాలు విరిగింది, వేణు తీవ్ర గాయాల పాలయ్యాడు. పోస్టమార్టం అనంతరం గురువారం సాయంత్రం శవాలను నర్సింగరావు పల్లికి తీసుకురాగా, గిరిజనులంతా గొల్లుమన్నారు.

విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదిక..

సంగారెడ్డి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదిక ఇన్‌స్పైర్ మనక్ అని సంగారెడ్డి జిల్లా డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ నామినేషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల నుంచి ఐదు నామినేషన్లు పంపాలని సూచించారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి, సకురా జపాన్ ఎక్చేంజ్ ప్రోగ్రాంకు ఎంపికకైతే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అవుతుందన్నారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సెప్టెంబరు 15 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 6302290235 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సమాచారం ఇవ్వండి

ములుగు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ములుగులోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ వెస్టజోన్ కమిటీ సభ్యులు జూలకంటి నాగరాజు, ఎంతఓ ఉదయభాస్కర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం సమర్పించారు.

22న ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మెదక్‌అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న మెదక్ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఫుట్‌బాల్ కిట్టుతో హాజరై ఉదయం 7 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 28 నుంచి జూలై 1 వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

ఆలయంలో చోరీ కేసులో..

నిజాంపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో చోరీకి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని కల్వకుంట గ్రామ శివారులో గల పెద్దమ్మ, గంగమ్మ దేవాలయాల్లో గత నెల 30న రాత్రి ఆలయాల్లో చొరబడి పుస్తె, మెట్టెలు, కొంత డబ్బు అపహరించారు. నిందితుడు సిద్దిపేట జిల్లా తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఆందోల్ నవీన్‌ను గురువారం రోజున వల పన్ని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. అలాగే దొంగిలించిన సొత్తును రికవరీ చేశామని ఎస్సై రాజేష్ తెలిపారు.

బ్యాటరీల చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

నిజాంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సెల్ టవర్ల వద్ద బ్యాటరీలు దొంగిలించిన ముఠాను మెదక్ జిల్లా నిజాంపేట పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఇరువురిని గురువారం రిమాండ్ చేశారు. నాలుగు మాసాలుగా రామాయంపేట, చిన్న శంకరంపేట, నిజాంపేట ప్రాంతాల్లో 48 బ్యాటరీలు దొంగతనం చేశారు. టవర్ల యాజమాన్యాలు తిరిగి బ్యాటరీలు బిగించడంతో.. మరో మారు నాలుగు రోజుల క్రితం నిజాంపేట టవర్ వద్దకు బ్యాటరీలను ఎత్తుకెళ్లేందుకు నిందితులు వచ్చారు. అప్పటికే గస్తీ తిరుగుతున్న పోలీసులు విషయాన్ని గమనించి పట్టుకునే ప్రయత్నంలో టాటాఏసీ, ట్రాక్టర్లను వదిలి పారిపోయారు. అప్పటినుంచి వివిధ కోణాల్లో విచారించిన నిజాంపేట ఎస్సై రాజేష్ ప్రత్యేక పోలీసు బృందాలు రామాయంపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన గుర్రం యాదగిరి, గుర్రం శ్రీకాంత్‌లను గ్రామ శివారులోని చెరువు కట్ట ప్రాంతంలో వల పన్ని పట్టుకున్నారు. గురువారం వారిని రిమాండ్‌కు పంపించారు.

ఆడపిల్లలు పుట్టారు.. అదనపు కట్నం తీసుకురా

శివ్వంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారు.. అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. మెదక్ జిల్లా శివ్వంపేట పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొంతాన్‌పల్లికి చెందిన దొంతి సారికకు మెదక్‌కు చెందిన కిషోర్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పట్లో ఆరు తులాల బంగారం, ద్విచక్రవాహనం, ఇతర లాంఛనాలు ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. అప్పటి నుంచి భర్త ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని.. అదనపు కట్నం, బంగారం తీసుకురావాలని కిషోర్ భార్యను వేధించేవాడు. అత్త పద్మ, మామ యాదగిరి, మరిది దినేష్‌లు కూడా వేధింపులకు పాల్పడేవారు. అంతటితో ఆగకుండా అదనపు కట్నం తీసుకురావాలని ఏడాదిన్నర క్రితం సారికను ఆమె పుట్టింట్లో వదిలి వచ్చాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగినా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

కేసు విచారణకు వచ్చిన పోలీసులపై దాడి

●ఎనిమిది మందిపై కేసు

చేగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక కిడ్నాప్ కేసు విచారణ కోసం వచ్చిన నిర్మల్ జిల్లా భైంసా పోలీసులపై అనుమానితులు దాడి చేశారు. విచారణ క్రమంలో తాము పోలీసులమని చెప్పినా వినకుండా రాళ్లు, కర్రలతో కొట్టడంతో ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఓ కానిస్టేబుల్‌ను హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల కొండాపూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసా పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలిక కిడ్నాప్ కేసు నమోదు అయ్యింది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రొబెషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ జుబేర్ నలుగురు సిబ్బందితో కలిసి ఓ ప్రైవేట్ వాహనంలో బుధవారం మెదక్ జిల్లా పాతూరు గ్రామానికి వచ్చారు. అక్కడ అనుమానితులను విచారించారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి చేగుంట మండలం బోనాల కొండాపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి సురేష్ ఇంటికి వెళ్లి తాము పోలీసులమని చెప్పారు. బాలిక కిడ్నాప్ విషయాన్ని ఆరా తీశారు. బాలికను కిడ్నాప్ చేస్తే కేసు అవుతుందని బెదిరించారు. అయితే, అక్కడి వారు బాలిక తమ వద్ద లేదని.. ఉన్నా సమాచారం ఇవ్వమని చెప్పారు. ఈ క్రమంలో బ్యాగరి చంద్రం, ఆయన కుమారుడు బ్యాగరీ సురేష్, బ్యాగరీ రత్నమ్మ, బ్యాగరి వెంకటస్వామి, బ్యాగరీ సంజీవ్‌లు పోలీసులను దూషిస్తూ.. వారిపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. అలాగే, కొందరు వారి వాహనం ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ దాడిలో కానిస్టేబుల్ విజయ్ కుడి చేతికి గాయం అయింది. మరో కానిస్టేబుల్ శరత్‌చంద్ర తలకు గాయమైంది. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ శరత్‌చంద్రను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భైంసా ప్రొబెషనరీ ఎస్సై షేక్ జుబేర్ ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. పోలీసులపై దాడి చేసిన బ్యాగరీ చంద్రం, బ్యాగరీ సురేష్, బ్యాగరీ రత్నవ, బ్యాగరీ సంజీవులను అరెస్టు చేసి, రిమాండ్ తరలించారు.

పట్టాలు దాటుతు రైతు మృతి

జహీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంకుంట-బూడ్డిపాడ్ గ్రామశివారులో రైలు పట్టాలను దాటుతూ తూంకుంట గ్రామానికి చెందిన మంగలి చంద్రన్న(51) మృతిచెందాడు. వికారాబాద్ పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం మంగలి చంద్రన్నకు సంబంధించిన వ్యవసాయపొలం రైలుపట్టాల అవతలివైపు ఉండటంతో బుధవారం సాయంత్రం రైలుపట్టాలను దాటి ఇంటికి వస్తున్న సమయంలో రైలు రావడాన్ని గమనించక పట్టాలను దాటుతున్న క్రమంలో మృతిచెంది ఉంటాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

గజ్వేల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగాలేని ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో మృతి చెందింది. ఈ సంఘటన గురువారం జరిగింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లాకు చెందిన నల్ల రేణుకకు జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌కు చెందిన ఎల్లంతో 2022లో వివాహం జరిగింది. కొంతకాలం పాటు వీరు బాగానే ఉన్నప్పటికీ రేణుక అనారోగ్యానికి గురై మతిస్థిమితం కోల్పోగా, కుటుంబ సభ్యులు ఎర్రగడ్డలోని మెంటల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఏడాది క్రితం నుంచి తల్లిగారింటివద్దనే ఉన్న రేణుక ఈ నెల 16న తన భర్త వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరింది. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ నుండి జగదేవ్‌పూర్ మార్గంలో ఓ నర్సరీ సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ గురువారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..


రంగంపేట సత్తయ్య

రాయపోల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం ఆరేపల్లి సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బండారం గ్రామానికి చెందిన రంగంపేట సత్తయ్య(48) గురువారం సాయంత్రం తన బైక్‌పై గజ్వేల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆరేపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో సత్తయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


శ్రీకాంత్ (ఫైల్ ఫొటో)

చేగుంట ,జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన గురువారం రుక్మాపూర్ గ్రామంలో జరిగింది చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగారపు శ్రీకాంత్ (26) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అవసరం నిమిత్తం అప్పులు చేసి అప్పు తీర్చే మార్గం లేక మనస్థాపం చెంది తన వ్యవసాయ పొలం వద్ద కేబుల్ వైర్‌తో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కొడుకు ఉన్నారు. తల్లి నాగారపు శివమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

●దినసరి కూలీ ఆత్మహత్య

చేర్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థికఇబ్బందులు తాళలేక దినసరి కూలీ ఎండి.జాఫర్ (40) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. పేదకుటుంబానికి చెందిన జాఫర్ అతడి భార్య కలిసి భవన నిర్మాణ కూలీపనులకు వెళ్తున్నారు. కుటుంబ పోషణ భారంగా మారడంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న క్రమంలో గ్రామశివారులోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కలవారు కుటుంబసభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఈవిషయమై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తుచేపట్టారు. చేర్యాల మార్చురీకి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

సదాశివపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా పార్కింగ్ చేసిన ఓ లారీని వెనకవైపు నుంచి వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన గురువారం వేకువ జామున సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై జరిగింది. సదాశివపేట సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం బీదర్ తాలుకా వాల్కండే గ్రామానికి చెందిన బీరప్ప(40), అదే గ్రామానికి చెందిన జైభీమ్ (42) వీరు కేఏ56 2694 నెంబర్ గల లారీపై డ్రైవర్, క్లీనర్‌గా పని చేస్తున్నారు. వీరు హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులోకి రాగానే రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ బీరప్ప, క్లీనర్ జైభీమ్‌లు అక్కడికక్కడే చనిపోయారు.

క్రీడా ప్రాంగణం కళకళ

● నిజాంపేటలో రూ.8 లక్షల వ్యయంతో పరికరాల ఏర్పాటు



నిజాంపేట క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

నిజాంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడో ఊరి చివర... ప్రహరీ లేని ఓ ఖాళీ స్థలం... తుమ్మచెట్లు, గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి కనిపిస్తూ.. ఓ పక్కన బోర్డు, దానిపై క్రీడా ప్రాంగణం, గ్రామ పంచాయతీ అనే పేరుకే పరిమితమై ఉన్నాయి పలు గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు.. కానీ మెదక్ జిల్లా నిజాంపేటలోని క్రీడా ప్రాంగణం మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. మండల కేంద్రానికి కొద్ది దూరంలోనే విశాలవంతమైన ప్రదేశంలో చుట్టూ ఫెన్సింగ్, మొక్కలతో చక్కగా రూపుదిద్దుకున్నది. ఇక్కడ దాతల సహకారంతో రూ.8 లక్షలు వెచ్చించి వ్యాయామ పరికరాలను అమర్చారు. తెల్లవారుజామునే గ్రామ యువకులు, పెద్దలు ఇక్కడికి చేరుకుని ఆహ్లాద వాతావరణంలో వ్యాయామం చేస్తున్నారు. యువకులు బ్యాడ్మింటన్, వాలీబాల్, క్యారంతోపాటు యోగాసనాలు చేస్తున్నారు. క్రీడా ప్రాంగణంలో చిన్నాపెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





ఆహ్లాదవాతావరణంలో యోగాసనాలు వేస్తున్న గ్రామస్థులు, నూతన బోర్డును ఏర్పాటు చేస్తున్న దృశ్యం(ఇన్‌సెట్‌లో)

'బోధకాలు' నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర కీటక జనిత వ్యాధుల నివారణ డీడీ వెంకటేశ్

సంగారెడ్డి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బోధకాలు (ఫైలేరియాసిస్) వ్యాధి నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కీటక జనిత వ్యాధుల నివారణ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్ సూచించారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం వైద్యులు, సీహెచ్‌వో, ఎంపీహెచ్‌ఈవో, సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎం, ఎంపీహెచ్‌ఏలకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధకాల వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణ చర్యలు, మాత్రల వినియోగంపై ఆయన వివరించారు. క్షేత్రస్థాయిలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఎలా అమలు చేయాలనే దానిపై తెలియజేశారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, ప్రోగ్రాం ఆఫీసర్ డా.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వైద్య సిబ్బంది వచ్చి మందులు పంపిణీ చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సునంద తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్

'వాగు దాటితేనే..' సమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశం

హుస్నాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి'లో 'వాగు దాటితేనే.. తాగునీరు' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనంపై సిద్దిపేట కలెక్టర్ కె.హైమావతి స్పందించారు. హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు వచ్చినప్పుడు మహ్మదాపూర్ - ఉమ్మాపూర్ వాగు దాటుకుంటూ మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌కు వెళ్లాల్సి వస్తుందని, వాగు ఉధృతంగా ప్రవహిస్తే నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు తాగు నీరు నిలిచిపోతుందని వచ్చిన కథనంపై వివరాలు అడిగారు. దీనికి పరిష్కారం ఏమిటో, వేరే అప్రోచ్ రోడ్డు ఉందో లేదో ప్రశ్నించి, సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

బొమ్మారెడ్డిగూడెంలో సమయానుసారంగా తాగునీటి సరఫరా

పుల్‌కల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : 'తాగునీరు.. డ్రైనేజీ పాలు' అనే శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో వేళాపాల లేకుండా తాగునీటి సరఫరా జరుగుతున్న విషయంపై కథనం ప్రచురితమైంది. ఈ సమస్యపై మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి శంకర్ స్పందించి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్.నరేష్‌ను వివరణ కోరారు. గిరిజన తండా ప్రజలు తమ అవసరాల కోసం సింగిల్ ఫేజ్ మోటారును ఆన్ చేశారని, అనంతరం బంద్ చేయకుండా వదిలేశారని నరేష్ తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో సమయానుసారంగా నీటి సరఫరా చేయిస్తామని పేర్కొన్నారు.

అండర్-19 క్రికెట్ లీగ్‌లో సంగారెడ్డి ఎల్లో జట్టు విజయం

115 పరుగులు చేసిన విఘ్నేష్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విఘ్నేష్

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ లీగ్ పోటీల్లో గురువారం సంగారెడ్డి ఎల్లో జట్టు విజయం సాధించింది. కొండాపూర్ మండలం సీహెచ్. కోనాపూర్ ఎంఏ క్రికెట్ మైదానంలో ఎల్లో, బ్లూ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి ఎల్లో జట్టు నిర్ణిత 50 ఓవర్లలో 289 పరుగులు చేసి, 9 వికెట్లు కోల్పోయింది. ఇందులో విఘ్నేష్ 115 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బ్లూ టీం 39.5 ఓవర్లలో 203 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో 86 పరుగుల తేడాతో సంగారెడ్డి ఎల్లో జట్టు విజయం సాధించింది.

'సహారా'లో దివ్యాంగుల ఆపరేషన్లు సక్సెస్

● ముగ్గురు పిల్లలకు ఉచితంగా నిర్వహణ



శస్త్రచికిత్స తర్వాత వైద్యుల బృందం, సహారా డైరెక్టర్ మఠం శంకర్

సంగారెడ్డి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాళ్లలో లోపాలతో దివ్యాంగులైన ముగ్గురు పిల్లలకు గురువారం సంగారెడ్డిలోని సహారా ఇన్‌క్లూజివ్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎదుగుదలలో లోపాలు కలిగిన పిల్లలతో పాటు వృద్ధులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించే కార్యక్రమానికి సహారా సొసైటీ (ఎస్ఐడిఏఆర్) శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రముఖ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఆనంద్, డా.సుధీర్, అనస్తేషియా వైద్యుల బృందం ముగ్గురు పిల్లలకు ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహారా డైరెక్టర్ మఠం శంకర్ మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తున్నామని, ఎవరికైనా ఆరోగ్య సేవలు పొందేందుకు ఆర్థిక భారం లేకుండా చూడాలన్నదే తమ లక్ష్యమన్నారు. వయోవృద్ధులకు కూడా ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య చికిత్సలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ కార్డియాలజిస్ట్ డా.మహేష్, డా.జమాలుద్దీన్ నవీద్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనం..



జహీరాబాద్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీ

అరకొర సేవలు

అధ్వానంగా జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీ

అత్యవసర పరిస్థితుల్లో రామచంద్రాపురం ఆస్పత్రికి రెఫర్

కార్మికులకు తప్పని అవస్థలు

జహీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్‌లో సుమారు 40 వేల మంది కార్మికులున్నారు. వీరిలో 4 వేల మంది ఈఎస్ఐ కార్డుదారులు ఉన్నప్పటికీ, వారికి సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. జహీరాబాద్‌లో 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీ నేటికీ అద్దె భవనంలోనే అరకొర సిబ్బందితో కొనసాగుతోంది. రోజుకు 180 మంది కార్మికులు వైద్యం కోసం వస్తున్నా, కేవలం ప్రాథమిక చికిత్స, మందుల పంపిణీతోనే సరిపెడుతున్నారు.

సొంత భవనం నిర్మాణంపై నిర్లక్ష్యం

గత 20 ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతున్న జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి సొంత భవనం ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇతర ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాల కోసం కృషి చేస్తుంటే, ఈఎస్ఐ సిబ్బంది, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల సహకారం లేకపోవడం కూడా దీనికి ఒక కారణమని తెలుస్తోంది. అరకొర సిబ్బందితో ఇరుకు గదులలో విధులు నిర్వహిస్తూ మొక్కుబడి వైద్యసేవలు అందిస్తున్నారని రోగులు వాపోతున్నారు.

ఆస్పత్రి కోసం కార్మికుల ఆందోళన

డిస్పెన్సరీని పూర్తిస్థాయి ఈఎస్ఐ ఆస్పత్రిగా మార్చాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు పలు మార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా బొల్లారం, జహీరాబాద్, పాటిమన్‌పూర్, ఇస్నాపూర్, సదాశివపేట, పటాన్‌చెరు ప్రాంతాల్లో డిస్పెన్సరీలు ఉన్నాయి. జిల్లాలోని పరిశ్రమల కార్మికుల కోసం రామచంద్రాపురంలో ఒక్క ఈఎస్ఐ ఆస్పత్రి మాత్రమే అందుబాటులో ఉంది. అత్యవసర వైద్యం కోసం జిల్లాలోని అన్ని డిస్పెన్సరీల నుంచి రోగులను అక్కడికే తరలించాల్సి వస్తోంది. జహీరాబాద్ కర్ణాటక, మహారాష్ట్రలకు సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ ఒక పెద్ద ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు అత్యవసరం అని స్థానికులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.



ఆస్పత్రి ఆవరణలో నెలకొన్న అపరిశుభ్రత

ఇక్కడ వ్యాధి నయం కాలేదు

నేను దిగ్వాల్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న. ఇటీవల పైల్స్ రావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చాను. ఇక్కడ వ్యాధి నయం కాలేదు. మెరుగైన వైద్యం రామచంద్రపురంలో అందుతుందని చెప్పడంతో అక్కడకు వెళ్లాను. వారం రోజుల పాటు వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. చివరకు జహీరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది. నాకు ఈఎస్ఐ సెలవులకు సంబంధించి కర్మాగారంలో దరఖాస్తు చేయాల్సి ఉండగా అందుకు వైద్యుల సంతకాలు, తదితరాలు అవసరం ఉంది. నాలుగైదు రోజులుగా ఈఎస్ఐ ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

- అనిల్, గురుజువాడ

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీలో పనిచేసే సిబ్బంది మొక్కుబడిగా విధులను నిర్వహిస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యం అంతంత మాత్రాంగానే వైద్యం అందుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ ప్రాంతంలో డిస్పెన్సరీ కాదు, ఈఎస్ఐ ఆస్పత్రినే ఏర్పాటు చేయాలి. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులు, నాయకుల దృష్టికి తీసుకు వెళ్లాం.

-రాములు నేత, మాజీ కౌన్సిలర్, కార్మిక సంఘం నాయకుడు

మెరుగైన వైద్యం అందేలా కృషి

ఆస్పత్రికి వైద్యం నిమిత్తం వచ్చే రోగులకు సాధ్యమైనంత వరకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులనిస్తూ మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు లేని కారణంగా జహీరాబాద్ నుంచి సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని రామచంద్రాపురం ఆస్పత్రికి వెళ్లాలంటూ సూచనలు చేస్తున్నాం. మందుల కొరత అసలే లేదు.

- శరత్ చంద్ర, ఈఎస్ఐ వైద్యుడు

బనకచర్ల పేరిట కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్

● చేతగాని పాలనతో రాష్ట్రం అతలాకుతలం

● స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసమే రైతు భరోసా విడుదల

● బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య



మాట్లాడుతున్న బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య

చేర్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని, చేతగాని పాలనతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిందని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. చేర్యాలలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యేటా 2-3 వేల టీఎంసీలు గోదావరినీరు సముద్రం పాలవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం.. బనకచర్ల, బంకమట్టి పేరిట డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాన్ని తప్పుబట్టిన ప్రభుత్వం గోదావరి నీళ్లను ఆపలేకపోయిందని, ఇప్పటికీ మేడిగడ్డ రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టలేదని, కనీసం మోటార్లు ఆన్‌చేయలేదన్నారు. సమ్మక్క-సారక్క బ్యారేజ్ పనులు పూర్తయినప్పటికీ గోదావరి నీటిని ఎందుకు ఎత్తిపోయ లేదన్నారు. పరిపాలించడం చేతగావడం లేదని, కాంగ్రెస్‌ది ఐరన్‌లెగ్ ప్రభుత్వమన్నారు. 18 నెలల పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనకబడిపోయినప్పటికీ, అవినీతిలో మాత్రం పెరిగిందని, మంత్రుల పేషీలలో 10-20 శాతం కమీషన్లు వసూలు చేయడమే నిదర్శనమన్నారు. రైతాంగం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, కేవలం స్థానిక సంస్థల ఎన్నికలలో లబ్ధికోసమే రైతుభరోసా నిధులు విడుదల చేస్తూ ఓట్ల రాజకీయాలకు పాల్పడుదందన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుని అప్పులపాలు చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ కూడా అదేతరహాలో వ్యవహరిస్తూ ప్రజలను వంచిస్తుందని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలిపిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు దేశప్రజలరక్షణను రెండుకళ్లగాచూసుకుంటుందన్నారు. అసాధ్యమైన ఆర్టికల్ 370ని రద్దుచేసి సుసాధ్యం చేయడంతో పాటు ఎన్నో ధైర్య, సాహసోపేత నిర్ణయాలు చేపట్టిందన్నారు. ఏ పల్లెలో చేసినా కేంద్ర ప్రభుత్వ పథకాలతో అభివృద్ధికి నోచుకున్నాయని, బీజేపీ తోనే సుస్థిరత సాధ్యమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు బూరుగు సురేశ్, తోకల ఉమారాణి, వడ్లకొండ సంజీవులు, కర్క తిరుపతిరెడ్డి, పోతుగంటి రాందాస్, తౌట బాలరాజు, ముచ్చంతుల సిద్ధారెడ్డి, కొట్టె చంద్రమౌళి, బోడిగం కృష్ణారెడ్డి, కుర్రారం బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

మద్దూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎంఈవో వరదరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 13 తర్వాత నుంచి ఆగస్టు 12 వరకు అడ్మిషన్ల కోసం లేట్ ఫీజు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో వృక్షశాస్త్రం బోధించుటకు అభ్యర్థులు ఈ నెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు.

అటానమస్ నావిగేషన్‌కు ముందడుగు

● 'మిత్సుబిషి ఎలక్ట్రిక్'తో ఐఐటీహెచ్ టీహన్ ఒప్పందం

కంది, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీహెచ్ టీహన్ (టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ అటానమస్ నావిగేషన్) అటానమస్ నావిగేషన్ రంగంలో ఉమ్మడి పరిశోధనల కోసం జపాన్‌కు చెందిన ప్రసిద్ధ మిత్సుబిషి ఎలక్ట్రిక్ కార్పొరేషన్‌తో కీలక ఒప్పందం చేసుకుంది. గురువారం ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి సమక్షంలో టీహన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజలక్ష్మి, మిత్సుబిషి ఎలక్ట్రిక్ కార్పొరేషన్ జనరల్ నోబుతోషి తోడోరోలు ఎంవోయూపై సంతకాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా బీఎస్ మూర్తి మాట్లాడుతూ, సమాచార ప్రాసెసింగ్, కమ్యూనికేషన్లు, అంతరిక్ష అభివృద్ధి, ఎలక్ట్రానిక్స్ రంగంలో మిత్సుబిషి ఎలక్ట్రిక్ కార్పొరేషన్‌కు వంద సంవత్సరాల అనుభవం ఉందన్నారు. అంతేగాక ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక సాంకేతికత, శక్తి, రవాణా, నిర్మాణ పరికరాలలో ఉపయోగించే విద్యుత్-ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో ఈ సంస్థ దిగ్గజ సంస్థగా నిలిచిందన్నారు. డ్రైవర్‌లెస్ టెక్నాలజీతో నడిచే వాహనాల్లో సాంకేతికతను విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ తెలిపారు.



మిత్సుబిషి ఎలక్ట్రిక్ కార్పొరేషన్ జనరల్ నోబుతోషితోఐఐటీహెచ్ డైరెక్టర్, తదితరులు

పాఠాలు చెబుతూనే పరలోకాలకు..

● తరగతి గదిలో గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



మధుసూదన్

కొండాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలను బోధిస్తూ గుండెపోటుతో ఓ ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మారేపల్లి ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాలోకి వెళ్తే.. సంగారెడ్డి మండలం కలబ్‌గూర్ చెందిన మధుసూదన్(52) 2018 నుంచి మారేపల్లి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం పాఠశాలకు వచ్చిన ఆయన ఉదయం నుంచి విద్యార్థులకు పాఠాలను బోధించాడు. తరగతి గదిలో పాఠం చెప్పి, బయటికి వచ్చే క్రమంలో గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకులారు. తోటి ఉపాధ్యాయులు తక్షణమే సంగారెడ్డిలోని ప్రైవేటు ఆసుప్రతికి తరలించారు. అప్పటికే ఆయన చనిపోయినట్లు డాక్టర్లు వెల్లడించారు. మధుసూదన్ ఉపాధ్యాయ సంఘంలోనూ చురుకుగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలను లేవనెత్తి పరిష్కరించే విధంగా చర్యలకు తాను సైతం ముందుండి నడిపించేవారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెప్పారు. తమకు చదువు నేర్పిన గురువు చనిపోయాడని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు సంతాపాన్ని ప్రకటించారు.

రెవెన్యూ సదస్సును సందర్శించిన అదనపు కలెక్టర్

బెజ్జంకి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లపై పరిశీలన

దుబ్బాక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో శుక్రవారం జరిగే రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ పర్యటన ఏర్పాట్లను గురువారం అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు దుబ్బాకలోని రజనీకర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఐదేళ్ల వరకు విద్యుత్ ఇబ్బందులు రావొద్దు

● టీజీ ఎస్‌పీ డీసీఎల్ అధికారులతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమీక్ష

నారాయణఖేడ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ నియోజకవర్గంలో రానున్న ఐదేళ్ల వరకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పూర్తి ప్రణాళికలతో కొత్త సబ్ స్టేషన్లు, 11 కేవీ లైట్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం టీజీఎస్‌పీడీసీఎల్ సంగారెడ్డి ఎస్ఈ ఐ.శ్రీనాథ్, డీఈ శ్రీనివాస్‌లు, ఏడీఈ వై.నాగిరెడ్డితో పాటు డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఖేడ్ పట్టణ శివారుతో పాటు, కంగ్టి మండలం బోర్గి, మనూరు మండలం రాయిపల్లి, నాగల్‌గిద్ద మండలం ఏనక్‌పల్లి గ్రామాల్లో నూతన 33/11కేవీ సబ్ స్టేషన్లకు ప్రతిపాదనలు రూపొందించారు. తరచూ విద్యుత్ ఇబ్బందులు తలెత్తుతున్నందున కొత్త ఫీడర్ చానెల్స్, 11కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు నిర్ధారించారు. రాయిపల్లి గ్రామం గజ్వాడ, రాయికోడ్ నుంచి, ఖేడ్ పట్టణానికి నూతన ఫీడర్ ఏర్పాటు చేయాలని సూచించారు. శాంతితండా నుంచి తడ్కల్‌కు కొత్త 11 కేవీ లైన్ తడ్కల్ ఘన్‌పూర్ వరకు 17 గ్రామాల్లో సమస్య పరిష్కరించేందుకు 3 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఖేడ్ మండలం తుర్కపల్లికి కొత్తఫీడర్ ఏర్పాటుకు నిర్ణయించారు. లోవోల్టేజీ సమస్య ఉన్నందున ఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్, రహేమాన్ కాలనీల్లో మూడు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రెండురోజుల్లో ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ర్యాలమడుగు 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు రూ.55 లక్షలతో కొత్త ఫీడర్‌ను ఏర్పాటు చేసి చార్జీ చేశారు. దీంతో నమ్లీమేట్, మూడు గుంటలు, నర్సాపూర్ గ్రామంతో పాటు పరిధిలోని తండాల్లో విద్యుత్ సమస్య పరిష్కారం కాలేదని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఈ శ్రీనాథ్, డీఈ శ్రీనివాస్‌లు, ఏడీఈ నాగిరెడ్డి, ఏఈలు, విద్యుత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రైతులు ఆధునిక సాగుపై దృష్టిసారించాలి

రైతులు ఆధునిక పంటల సాగుపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ శివారులోని రైతువేదికలో 75 శాతం సబ్సిడీపై సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా 62 మందికి స్ప్రింక్లర్ యూనిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వర్‌రావు, మండల అధికారులు పండరి, మౌనికరెడ్డి, ఏవో శంకర్, విఠల్ పాల్గొన్నారు.

ఐడీఏబొల్లారం పాఠశాలకు జాతీయస్థాయి గుర్తింపు

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఐడీఏబొల్లారం/పటాన్‌చెరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వారికి విద్యనందించే పాఠశాలగా ఐడీఏబొల్లారం ప్రభుత్వ బడికి గుర్తింపు ఉందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రూ.37.5 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించి మాట్లాడారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందినందున దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వారు ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారి పిల్లలకు చదువు నేర్పించేటట్టు ఆయా బాషల్లో ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అన్ని తరగతి గదుల్లో పరిశ్రమ వారు ఇచ్చిన రూ.25 లక్షలు వెచ్చించి నిపుణుల చిత్రాలు వేయించామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో 1,225 మంది విద్యార్థులు హాజరవుతున్నారని వివరించారు. దేశంలో మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చంద్రారెడ్డి, హనుమంతురెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగాడే పురస్కరించుకుని 21న ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు పట్టణంలోని మైత్రీ మినీ స్టేడియంలో సామూహిక యోగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గురువారం నాడు ఏర్పాట్లను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట సీఐ వినాయక్‌రెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, నాయకులు ఉన్నారు.



ఐడీఏబొల్లారం ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమ్మవారి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

చిన్నశంకరంపేట/మెదక్, కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామంలో గురువారం గ్రామ దేవతల బోనాల ఉత్సవాల్లో భాగంగా పాల్గొని ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం ఎత్తుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట శివారులో ఎడ్ల సుగుణ, కిష్టయ్య ప్లాంటేషన్‌లో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. అదేవిధంగా మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం కొవిడ్ ఐసోలేషన్ వార్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, సమన్వయకర్త డాక్టర్ శివదయాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ లోపంతో సమస్యలు అధికం

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

రామచంద్రాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కొన్నిశాఖల అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం వల్ల సమస్యలు అధికమవుతున్నాయని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. తెల్లాపూర్‌లోని డబుల్ బెడ్‌రూంలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గురువారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్య, పాఠశాల ఏర్పాటు, పిల్లల నమోదు, ఉపాధ్యాయుల నియామకం, మరుగుదొడ్ల ఏర్పాటుపై డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో రాథోడ్‌తో చర్చించారు. వైకుంఠధామం, శ్మశానవాటికకు సంబంధించి స్థల సేకరణకు తహసీల్దార్ సంగ్రారెడ్డితో చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో అసోసియేషన్లు ఏర్పాటు చేసి, ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని హౌసింగ్‌శాఖకు ఆదేశించారు. అనంతరం మున్సిపల్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి, సీడీపీవో జయరాం, రంగారావు, ఆర్ఐ శ్రీకాంత్, డీఈఈ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ డీఈఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ తప్పనిసరి

చిన్నశంకరంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని మెదక్ ఆర్టీఏ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని మేరిమాత, అబ్యాస ప్రైవేట్ స్కూళ్లను ఎస్ఐ నారాయణగౌడ్‌తో కలిసి సందర్శించి, బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించి మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీలు చేపట్టి, వాటి కండీషన్‌పై పాఠశాలల యాజమాన్యానికి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రయోజనాలే ముఖ్యం

● డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్

నర్సాపూర్/కౌల్దారం/శివ్వంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలో 5,6 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసి పలు ఇళ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శివాలయం వద్ద పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో అప్పటి నాయకులు కేవలం తమ స్వార్థ ప్రయోజనాలతో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రాష్ట్రాని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మల్లేశం, అంజిగౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కౌల్దారం మండలంలోని వరిగుంతం, కొంగోడు, పోతిరెడ్డిపల్లి, రంగంపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. శివ్వంపేట మండల పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తండాల్లో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన అవుసుల నరేందర్, గజేంద్రుల మమతకు మంజూరైన రూ.1.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.



నర్సాపూర్‌లోని 6వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేసి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

'తారా'లో మేధో సంపత్తి హక్కులపై జాతీయ సెమినార్

సంగారెడ్డి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో 'మేధో సంపత్తి హక్కులు' అనే అంశంపై ఒకరోజు జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిశోధకులు, అధ్యాపకులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధకులు హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ఇక్ఫాయ్ లా కళాశాల ప్రొఫెసర్ వీణ, పేటెంట్ ఐపీఆర్ ఇన్నోవేషన్ సొల్యూషన్స్‌కు చెందిన డా.శంకర్‌రావు ముంజాం, ఐవ పేటెంట్ సర్వీసెస్‌కు చెందిన శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యక్తులు తమ మేధో సంపద ద్వారా సృష్టించిన అంశాలపై కలిగి ఉన్న హక్కులనే మేధో సంపత్తి హక్కులని తెలిపారు. ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో సెమినార్ కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రత్నప్రభాకర్‌రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కౌడిపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామస్థులు మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ రాజేందర్, మాజీ సర్పంచ్ గంగాగౌడ్, మాజీ ఎంపీటీసీ సర్దన కిషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు మెమోరండం అందజేసి మాట్లాడారు. వెల్మకన్నె గ్రామ శివారులోని సర్వే నంబరు 447లో కౌడిపల్లికి చెందిన మోతీలాల్‌గౌడ్‌కు కొంతకాలం క్రితం 20 గుంట ప్రభుత్వ భూమికి అప్పటి ప్రభుత్వం పట్టా సర్టిఫికేట్ ఇచ్చిందన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని మరో 3 ఎకరాలకు సర్టిఫికేట్ పొంది కౌడిపల్లి నుంచి వెల్మకన్నెకు వచ్చే ప్రధాన రహదారి వెంట ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని వివరించారు. వివేకానంద యూత్, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వెల్మకన్నె గ్రామస్థులు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

తూప్రాన్/శివ్వంపేట/చేగుంట/చిన్నశంకరంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రెవెన్యూ సదస్సుల ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ పట్టణంలోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆర్డీవో జయచంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో తహసీల్దారు టెక్మాల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి పంచాయతీ పరిధిలోని శంకర్‌తండా చాకరిమెట్ల సహకారాంజనేయస్వామిని అదనపు కలెక్టర్ నగేష్ దర్శించుకున్నారు. ఆలయ ఈవో సారా శ్రీనివాస్, ప్రధాన పూజారి దేవదత్తశర్మ ఆయనను శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. చేగుంట మండలం చిట్టోజిపల్లిలోని 266/1 సర్వే నంబర్ సాదా బైనామాలను భూభారతిలోకి తీసుకోవాలని రైతులు రెవెన్యూ సదస్సులో అధికారులను కోరారు. స్పందించిన తహసీల్దార్ శ్రీకాంత్ ఆ సర్వే నంబరులోని 320 ఎకరాల భూమి కోర్టు కేసులో ఉన్నదని, అందువల్ల ఎలాంటి సాదా బైనామాలను తీసుకోలేమన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామంలో తహసీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో భూభారతి సదస్సు నిర్వహించారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్



నారాయణఖేడ్‌లో ఎంపీ సురేష్‌షెట్కార్‌కు కేక్ తినిపిస్తున్న కార్యకర్త



మెదక్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



జహీరాబాద్ : రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. రాహుల్‌గాంధీ భవిష్యత్‌లో భావి భారత ప్రధాని కానున్నారని వారు కొనియాడారు.

- న్యూస్ నెట్‌వర్క్

న్యూస్ బాక్స్

నేడు మెదక్‌లో తాగునీటి సరఫరా నిలిపివేత

మెదక్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని మంజీరా జంక్షన్ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున శుక్రవారం పట్టణంలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మూడురోజులుగా పైప్‌లైన్ల లీకేజీలకు భగీరథ సిబ్బంది మరమ్మతులు చేపట్టడం మూలంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. పట్టణ ప్రజలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఖేడ్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నారాయణఖేడ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పురపాలక సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాల్వల్లోని మురుగు తొలగించే పనులు ముమ్మరంగా చేపట్టారు. ఆయన వెంట శానిటేషన్ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులు ఉన్నారు.

వాచ్‌మన్, హెడ్ కుక్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నైట్ వాచ్‌మన్, హెడ్ కుక్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎంఈవో యాదగిరి, కస్తూర్బా బాలికల పాఠశాల ఎస్‌వో ఫాతిమా గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 వరకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెరువులో కబ్జా చేసిన వ్యక్తికి అధికారుల వత్తాసు

కల్హేర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కల్హేర్ మండలంలోని మార్డి పెద్దచెరువులో కబ్జాకు యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోకుండా, అతడికే వత్తాసు పలుకుతున్న తహసీల్దార్ శివశ్రీనివాస్, ఆర్డీవో అశోక్ చక్రవర్తిపై చర్యలు తీసుకోవాలని మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం కలెక్టర్ ప్రావీణ్యకు రైతుల తరఫున వినతిపత్రం పిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు.

'సమాజ సేవే లక్ష్యంగా పనిచేయాలి'

చేగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : చేగుంట లయన్స్ క్లబ్ సామాజిక సేవలో ముందుందని పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ ఎస్ఎస్ శ్యామ్‌కుమార్ అన్నారు. చేగుంట మండల కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో లయన్స్ క్లబ్ 29వ ఇన్‌స్టాలేషన్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా శంభుని శ్రీనివాస్, సెక్రెటరీగా పి.నాగరాజు, ట్రెజరర్‌గా నాగేశ్వర్ ప్రమాణ స్వీకారం చేశారు.

'రెచ్చగొట్టే మాటలు మానుకో'

హత్నూర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నా ఉద్దేశంతోనే ఎంపీ రఘునందన్‌రావు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ కాసాల విఠల్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొట్లచెర్వు కృష్ణ, విజయ భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈనెల 18న బోర్పట్ల గ్రామానికి వచ్చిన ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అలజడి సృష్టించేందుకు ఆజ్యం పోసే విధంగా ప్రసంగం చేశారని అన్నారు. ఇలాంటి తప్పుడు మాటలు మానుకోవాలని, లేనియెడల ప్రజలే తగిన విధంగా బుద్ధి చెప్తారని వారు స్పష్టం చేశారు.

క్రీడా పాఠశాలకు ఎంపికలు

తూప్రాన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ గురుకుల పాఠశాలలో క్రీడా పాఠశాలకు మండల స్థాయిలో విద్యార్థుల ఎంపికను గురువారం నిర్వహించినట్లు ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, పలు అంశాల్లో ప్రతిభచూపిన ఐదుగురిని జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు వివరించారు. 26న మెదక్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించే జిల్లాస్థాయి ఎంపికలో పాల్గొంటారని తెలిపారు.

సాయిబాబా, దత్తాత్రేయ ఆలయంలో పూజలు

శివ్వంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గూడూరు గురుపీఠంలో ఇటీవల నిర్మించిన దత్తాత్రేయ స్వామి, పంచాయతనం షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం జేష్ఠ బహుళ అష్టమి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మన్ రమాదేవి శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అలాగే ఆలయానికి హుండీ బహుకరించిన దాత మల్లేశంగౌడ్‌ను సన్మానించారు.

మూడు విడతల రైతుబంధు విడుదల చేయాలి

● మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే మూడు విడతల రైతుబంధు డబ్బులను విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నారాయణఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, రబీ, ఖరీఫ్ పంటలకు సంబంధించి రైతుల ఖాతాల్లో డబ్బులు వేయకుండా కాలయాపన చేసిందన్నారు. మూడు పంటల నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, విఠల్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

● పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్



అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాలో త్వరలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ అటవీశాఖ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం సంబంధించి వినతిపత్రం అందజేసి, విలేకరులతో మాట్లాడారు. 23 నుంచి జూలై 6 వరకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నందున అటవీశాఖ అధికారులు కూడా సహకరించాలని కోరినట్లు చెప్పారు. అదేవిధంగా స్థానిక చిల్డ్రన్స్ పార్కులో పట్టణంలోని పలు వార్డుల నాయకులతో పాటు రచ్చబండ నిర్వహించి పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు చంద్రయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

● బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

తూప్రాన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం తూప్రాన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్ల శంకర్ అధ్యక్షతన వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బైరి శంకర్ మాట్లాడుతూ తెలంగాణలో నరేంద్రమోదీ సుపరిపాలనలో భాగంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ నత్తి మల్లేశ్ ముదిరాజ్, మండల అధ్యక్షులు పిట్ల పోచయ్య, వెంకటేశ్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయానికి రైతులు అలవాటుపడాలి



రైతులకు సోయా విత్తనాలను పంపిణీ చేస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానుగుణంగా లాభసాటి వ్యవసాయం చేసేందుకు రైతులు అలవాటు పడాలని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి పేర్కొన్నారు. నారింజ రైతుమిత్ర ఉత్పత్తి కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కోహీర్, మొగుడంపల్లి మండలాలకు చెందిన రైతులకు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉచితంగా సోయాబిన్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాంలింగారెడ్డి, హన్మంతరావుపాటీల్, ఏడీఎం కర్మాగారం అధికారి పాటీల్, కేవీకే శాస్త్రవేత్త స్నేహలత, నారింజ రైతుమిత్ర ఉత్పత్తి కేంద్రం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో 108 మందికి కంటి పరీక్షలు

నారాయణఖేడ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ శ్రీ సత్యసాయి సేవా నిలయంలో గురువారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా 108 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అలాగే 55 మందికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి, ఉచిత శస్త్ర చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

గ్రామీణులే టార్గెట్‌గా సైబర్ నేరాలు : డీఎస్పీ

తూప్రాన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణాలు టార్గెట్‌గా జరిగిన సైబర్ నేరాలు.. గ్రామీణులే టార్గెట్‌గా సైబర్ నేరాలు జరుగుతున్నాయని తూప్రాన్ డీఎస్పీ జే.నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్‌ను సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందంతో కలిసి ఆవిష్కరించారు. సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతుందని, నేరస్తులు గ్రామీణులను టార్గెట్ చేస్తు నేరాలకు పాల్పడుతున్నారని డీఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోస్టర్లతో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

చెరకు రైతులను ఆదుకోవాలి : నరోత్తం

జహీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల్లో చెరకు సాగుచేస్తున్న రైతులను ఆదుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 12 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు పంట ఉత్పత్తి అవుతుందన్నారు. జహీరాబాద్ ప్రాంత రైతులు చెరకు పంటను పండించడం ఓ ఎత్తైతే... మార్కెట్లో అమ్ముకోవడం మరో సమస్యగా మారిందన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి మూతపడిన ట్రైడెంట్ చక్కర కర్మాగారాన్ని తెరిపించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

కలెక్టర్ మారినా.. మారని ఫొటో!

● పాత కలెక్టర్ చిత్రపటానికి.. కొత్త కలెక్టర్ ఫొటో కాగితం!

మునిపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండలం మల్లికార్జున్‌పల్లి గ్రామంలో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై పాత కలెక్టర్ వల్లూరు క్రాంతి ఫొటో తీసేయకుండా.. అదే ఫొటోపై కొత్త కలెక్టర్ ప్రావీణ్య ఫొటోను ప్రింట్ తీసి అతికించారు. దీన్ని చూసిన పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువుటద్దమని పేర్కొంటున్నారు.



ఫ్లెక్సీపై పాత కలెక్టర్ ఫొటోపై ప్రింట్ తీసి ఏర్పాటు చేసిన కొత్త కలెక్టర్ ఫొటో